క్లుప్తంగా

బీఆర్ఎస్‌లో చేరిక

శంకరపట్నం: మండలంలోని పలు పార్టీలకు చెందిన నాయకులు మంగళవారం సర్పంచ్ మానస, ఎంపీటీసీ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో క్యాంప్ ఆఫీస్‌లో ఎమ్మెల్యే రసమయి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వీరివెంట జెడ్పీటీసీ శ్రీనివాస రెడ్డి, ఉపసర్పంచ్, జంపయ్య, ధర్మేశ్, తదితరులు పాల్గొన్నారు.

విరాళం అందజేత



హుజూరాబాద్‌రూరల్ : మండలంలోని చెల్పూర్ గ్రామంలోని శివాలయం పునరుద్ధరణ కోసం పరకాల మండలం గూడేప్పాడు గ్రామానికి చెందిన శ్రీకర్‌రెడ్డి–లిఖిత దంపతులు రూ. లక్ష 16 వేల చెక్కును విరాళంగా అందజేశారు. మంగళవారం ఆలయ అర్చకులు శంకరయ్యకు చెక్కును అందజేశారు.

కమిటీ ఎన్నిక

వీణవంక: సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మండలంలోని కొండపాకకు చెందిన మేడగోని బుచ్చయ్య గౌడ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చల్లూరుకు చెందిన బొంగోని పెద్ద రాజయ్యగౌడ్‌ను రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు వీరగోని పెంటయ్య గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు సింగం సత్తయ్యగౌడ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లేశంగౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పరుశరాములు గౌడ్, తిరుపతిగౌడ్, అధికార ప్రతినిధి గుడాల రాజేశంగౌడ్, రాష్ట్ర సలహాదారు గోపగోని సారయ్యగౌడ్, కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

హుజూరాబాద్ : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వీప్ కార్యక్రమం నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఇందిరాదేవి తెలిపారు. కార్యక్రమానికి ఆర్డీవో రాజు హాజరై మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. తహసీల్దార్ విజయ్‌కుమార్, కళాశాల ఎలక్టోరల్ లిటరసీ క్లబ్ నోడల్ ఆఫీసర్ స్వప్న, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.లక్ష్మీనరసింహమూర్తి, అధ్యాపకులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

మానకొండూర్: ముది రాజ్ మహాసభ మండల అధ్యక్షుడిగా మండలంలోని దేవంపల్లి గ్రామానికి చెందిన బోయిని వెంకటేశ్‌ను ఎన్నుకున్నారు. మండల కేంద్రంలోని పెద్దమ్మ తల్లి ఆలయంలో ముదిరాజ్ మహాసభ మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల ప్రధాన కార్యదర్శిగా శ్రీదర్ ముదిరాజ్, ఉపాధ్యక్షుడిగా తాళ్లపల్లి శేఖర్ ముదిరాజ్‌ను ఎన్నుకున్నారు.

వాహనాల తనిఖీ

హుజూరాబాద్: పట్టణంలోని సిర్సపల్లి క్రాస్ రోడ్డు వద్ద మంగళవారం ఆర్టీసీ, రవాణా శాఖ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా వాహనాల పత్రాల పరిశీలించారు. సరైన పత్రాలు లేని వాహనదారులకు జరిమానా విధించారు. కార్యక్రమంలో ఎంవీఐ సిరాజ్ ఉర్ రహమాన్, ఆర్టీసీ డిపో మేనేజర్ అర్పిత, తదితరులున్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

గంగాధర: మండలంలోని ఉప్పర మల్యాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలోమంగళవారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. రేకుర్తి కంటి వైద్యశాల వైద్యులు 92 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 28 మందికి కంటి ఆపరేషన్ అవసరమున్నట్లు గుర్తించి బస్సులో వైద్యశాలకు తరలించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కల్యాణ్, ప్రధాన కార్యదర్శి శ్రీరామ్ శ్రవణ్, ట్రెజరర్ విజేందర్ రెడ్డి, సర్పంచ్ మంజుల శ్రీనివాస్ రెడ్డి, ఎంపీటీసీ ముద్దం జమున నగేశ్, ఉపసర్పంచ్ నర్సింహరెడ్డి, పాల్గొన్నారు.

మండలకేంద్రంగా ప్రకటించాలి

గంగాధర: మండలంలోని గర్శకుర్తి గ్రామాన్ని ప్రభుత్వం మండలకేంద్రంగా ప్రకటించాలని, లేకపోతే బీఆర్ఎస్ నాయకులను గ్రామంలో తిరగనివ్వమని గర్శకుర్తి మండల సాధన కమిటీ సభ్యులు మంగళవారం హెచ్చరించారు. మంగళవారం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సమితి సభ్యులు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే రవిశంకర్ తమను మోసం చేసి దీక్షలు విరమింపజేశారని, కుట్రపూరితంగా చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోకపోతే బీఆర్ఎస్ నాయకులతో పాటు ఎమ్మెల్యేను గ్రామంలో తిరుగనివ్వమని హెచ్చరించారు.సాధన కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళకు గాయాలు

వీణవంక: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కటౌట్ ఈదురుగాలులకు కూలి ఓ మహిళకు స్వల్ప గాయాలయ్యాయి. గ్రామస్తుల వివరాల ప్రకారం బస్టాండ్ సమీపంలో పలువురి నాయకులతో కూడిన కటౌట్‌ను ఏర్పాటు చేశారు. మంగళవారం సాయంత్రం ఈదురు గాలులు వీయడంతో కటౌట్ కూలి మండల కేంద్రానికి చెందిన స్వరూపకు స్వల్ప గాయాలయ్యాయి, స్థానికులు జమ్మికుంటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అక్కడి నుంచి హన్మకొండలోని హజారా ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ పాడి కౌశిక్‌రెడ్డి ఆస్పత్రికి వెళ్లి బాధితురాలిని పరామర్శించి ఆర్థిక సాయం అందించారు.

వ్యవసాయ రుణాలు.. బహుముఖ సేవలు

- చొప్పదండి పీఏసీఎస్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు
- వరుసగా నాలుగోసారి జాతీయ అవార్డుకు ఎంపిక
- నాఫ్‌స్కాబ్ ఆధ్వర్యంలో ఈనెల 26న ప్రదానం



చొప్పదండి: రైతులకు సేవలతో జాతీయ స్థాయి ఖ్యాతి పొందిన చొప్పదండి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మరో అరుదైన స్థాయిని దక్కించుకుంది. దేశంలోని 93 వేల సహకార సంఘాల్లో జాతీయ స్థాయిలో మొదటి స్థానంలో నిలిచింది. నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ స్టేట్ కోఆపరేటివ్ బ్యాంక్స్ లిమిటెడ్ (నాఫ్‌స్కాబ్) 2020–21, 2021–22 ఆర్థిక సంవత్సరాలకు గాను ప్రకటించిన జాతీయ ఉత్తమ పీఏసీఎస్‌లలో టాప్ 1లో నిలిచింది. నాలుగేళ్లుగా జాతీయ ఉత్తమ పీఏసీఎస్‌గా ఎంపికవుతూ రెండు, మూడు స్థానాలను అధిగమించి ఈ ఏడాది ప్రకటించిన అవార్డుల్లో మొదటి స్థానంలో సాధించింది. 2017–18 ఆర్థిక సంవత్సరంలో తొలిసారి జాతీయ ఉత్తమ పీఏసీఎస్ అవార్డు పొందిన చొప్పదండి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం రెండేళ్ల క్రితం జాతీయ స్థాయిలో ద్వితీయ ఉత్తమ సహకార సంఘంగా ఎంపికై అవార్డు పొందగా గతేడాది నాఫ్‌స్కాబ్ ప్రకటించిన జాతీయ ఉత్తమ సహకార సంఘాల్లో మూడో స్థానంలో నిలిచి అవార్డు అందుకుంది. ఈనెల 26న రాజస్థాన్‌లోని జైపూర్‌లో జరిగే అవార్డుల ప్రదానోత్సవంలో అవార్డు తీసుకోవాలని సొసైటీ చైర్మన్ వెల్మమల్లారెడ్డికి ఆహ్వానం అందింది.

ఇతర సంఘాలకు ఆదర్శంగా సేవలు

రైతులకు వ్యవసాయ రుణాలతో పాటు, బహుముఖ రంగాల్లో సేవలు అందుబాటులోకి తీసుకువచ్చి చొప్పదండి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆదర్శంగా నిలిచింది. చిన్న, సన్నకారు రైతులకు సంఘం ద్వారా సభ్యత్వం కల్పించి రుణాలు ఇవ్వడం, పథకాలు అందించి జాతీయ సహకార అభివృద్ధి సంస్థ అధ్యయనంలో యేటా ఉత్తమ పీఏసీఎస్‌గా నిలుస్తోంది.

రూ. పది వాటాతో ప్రారంభం

పది మంది సభ్యులు, రూ. పది చొప్పున వాటాలు వేసుకొని ప్రారంభించిన సహకార సంఘం నేడు రూ.పదికోట్ల టర్నోవర్‌ను దాటింది. నాబార్డు ద్వారా ప్రశంసలు పొందిన పీఏసీఎస్ రాయితీతో కూడిన 500 మెట్రిక్ టన్నుల గోదాం నిర్మించడం గమనార్హం. కంప్యూటరైజ్ బ్యాంకింగ్‌కు కొత్త భవనం నిర్మాణంతో పాటు, లాకర్ల సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చిసేవలు అందిస్తున్నారు.

ఏడు దశాబ్దాలుగా సేవలు

చొప్పదండిలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని 1952లో నవంబర్ 29న ప్రారంభించారు. గ్రామానికి చెందిన క్లెం మల్లారెడ్డి (చెక్కెర మల్లారెడ్డి) అనే రైతు ఆధ్వర్యంలో అప్పట్లో సంఘం స్థాపనకు పది మంది సభ్యులు తలా రూ. పది చొప్పున వాటా సమకూర్చుకొని సహకార సంఘాన్ని ప్రారంభించారు. పది మందితో ప్రారంభమైన సంఘం ఇప్పుడు నాలుగున్నర వేలకు పైగా సభ్యులతో కొనసాగుతోంది.

రుణాల రికవరీలో ఆదర్శం

రైతులు గడువులోగా స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాల వాయిదాలను చెల్లిస్తుండటంతో సంఘం రుణాల రికవరీలో వందశాతం రికార్డును నమోదు చేసుకుంటోంది. సంఘంలో ఇప్పటివరకు స్వల్ప, దీర్ఘకాలిక రుణాలు రూ.19 కోట్లు రైతులకు అందించగా యేటా వందశాతం రికవరీ జరగడంతో ప్రభుత్వం ద్వారా రివార్డులు పొందుతున్నారు.

ఆకట్టుకుంటున్న సేవలు


- 1994 నుంచి బియ్యం విక్రయ కేంద్రం ఏర్పాటు చేసి నాణ్యమైన బియ్యాన్ని మార్కెట్ ధర కంటే తక్కువకే సరఫరా చేస్తున్నారు.
- 2003 నుంచి చొప్పదండిలోని నవోదయ విద్యాలయం పక్కన పెట్రోల్, డీజిల్ బంక్ ఏర్పాటు చేసి సంఘం సభ్యులకు కల్తీలేని పెట్రోల్, డీజిల్‌ను సరఫరా చేస్తూ లాభాలను ఆర్జిస్తున్నారు.
- 1982 నుంచి రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించేందుకు ప్రత్యేక విత్తన విక్రయ కేంద్రాలను, తక్కువ ధరలో నాణ్యమైన ఎరువులను సంఘం ద్వారా విక్రయిస్తున్నారు.
- తొమ్మిది గ్రామాల్లో విస్తరించిన సంఘానికి ఏడు గ్రామాల్లో ఇప్పటికే గోదాములు నిర్మించారు.
- రైతులకు సంఘం ద్వారా రూ.4 లక్షల ప్రమాద బీమా కల్పించారు. ఈ ప్రీమియం సొమ్మును సంఘమే భరిస్తోంది.
- ఒక్కో ఎకరానికి రూ. 30 వేల క్రాప్‌లోన్ ఇవ్వాల్సిన నిబంధన ఉండటంతో చైర్మన్ మల్లారెడ్డి ఆధ్వర్యంలో తీర్మానం చేసి ఒక్కో ఎకరానికి రూ. పది వేల విలువైన మందు బస్తాలను అదనంగా వడ్డీపై ఇస్తున్నారు.
- దీర్ఘకాలిక రుణాలను ఇతర బ్యాంకుల్లో రెండు మూడు నెలల జాప్యంతో ఇస్తే, ఈ బ్యాంకు ద్వారా సత్వరమే విచారణ జరిపి పది రోజుల్లోపు రుణాలు మంజూరు చేసి అందజేస్తున్నారు.
- నాబార్డు రూ.రెండు కోట్ల వడ్డీ లేని రుణాన్ని సహకార సంఘానికి అందించగా, రా రైస్‌మిల్లు వేసేందుకు తీర్మానం చేశారు. వరుసగా మూడు సార్లు జాతీయ అవార్డు ఎంపికకావడంతో దేశవ్యాప్తంగా పలు సహకార సంఘాల అధ్యక్షులు, ఉద్యోగులు ఇక్కడి సంఘం పనితీరు తెలుసుకునేందుకు తరలివస్తున్నారు.

పనితీరుకు గుర్తింపు



రైతులకు అందుబాటులో ఉంటూ సేవందిస్తుండటంతో జాతీయస్థాయిలో యేటా గుర్తింపు వస్తోంది. వరుసగా నాలుగో సారి అవార్డు పొందడం సంతోషంగా ఉంది. పాలకవర్గ సభ్యులు, ఉద్యోగుల అంకితభావంతో మరిన్ని విజయాలు సాధిస్తాం.
– వెల్మ మల్లారెడ్డి, చైర్మన్, పీఏసీఎస్, చొప్పదండి

అందరి సహకారంతోనే..



యేటా రైతులు వందశాతం రుణాలు చెల్లిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నా రు. రైతుల అవసరాలను గుర్తించడంతో పాటు సేవలు అందించడంతో ఉత్తమ ఫలితాలు వస్తున్నాయి. జాతీయస్థాయిలో అవార్డు రావడం ఆనందంగా ఉంది.
– తిరుపతిరెడ్డి,సీఈవో, పీఏసీఎస్, చొప్పదండి

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



మాట్లాడుతున్న ఏసీపీ జీవన్‌రెడ్డి

- ఏసీపీ జీవన్‌రెడ్డి

హుజూరాబాద్ : శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని ఏసీపీ జీవన్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ రానున్న అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా ప్రతిఒక్కరూ ఎన్నికల నియామవళి పాటించాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగవద్దని, ఎలాంటి గొడవలకు పాల్పడవద్దని సూచించారు. సీఐ రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందకుంట: త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని హుజూరాబాద్ ఏసీపీ జీవన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణంలో ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు తప్పవన్నారు. అనుమతి లేకుండా డీజేలు పెడితే కేసులు నమోదు చేస్తామన్నారు. యువత అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. సామాజిక మాధ్యమాల్లో రెచ్చగొట్టే పోస్టులు పెడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సీఐ కిషోర్, ఎస్సై రాజ్‌కుమార్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్లు నెరవేర్చాలని ఆశా వర్కర్ల నిరసన



నిరసన తెలుపుతున్న ఆశావర్కర్లు

చిగురుమామిడి: తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ఆశా కార్యకర్తలు మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమకు రూ.18వేల వేతనం అందించాలన్నారు. కనీస సౌకర్యాలు కల్పించకుండా ప్రభుత్వం ఆశా కార్యకర్తలతో వెట్టిచాకిరీ చేయిస్తోందన్నారు. తమ డిమాండ్లను పరిష్కరించని పక్షంలో సమ్మెకైనా సిద్ధంగా ఉన్నామన్నారు. ఆశా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మారెల్ల శ్రీలత, మండల అధ్యక్షురాలు నాగెల్లి పద్మ, కార్యదర్శి పెద్పల్లి శోభ, నాయకులు అంజలి, సరోజన, మంజుల, కమల, సుగుణ, శోభ, స్రవంతి, పుష్ప, నాగరాణి, సాహిదాబేగం, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలి

హుజూరాబాద్ : పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టి ఆమోదించాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ ఇచ్చిన పిలుపుమేరకు మంగళవారం ఎమ్మార్పీఎస్, ఎంఐఎఫ్ నాయకులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వినతిపత్రాలు అందజేశారు. అనంతరం ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అధికారంలోకి వస్తే వంద రోజుల్లో వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చిన బీజేపీ ప్రభుత్వం తొమ్మిది ఏళ్లైనా ఎస్సీ వర్గీకరణ చేయలేదని వారు ఆరోపించారు. ఇక్కడ ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ రామచంద్రం, కో కన్వీనర్ శ్రీనివాస్, సీనియర్ నాయకులు సాగర్, రవీందర్, రత్నం, శేఖర్, మేకల మల్లేశ్, రొంటాల రాజ్‌కుమార్, రామగిరి సారయ్య, రఘు, తిరుపతి తదితరులున్నారు.

వాటర్ ప్లాంట్లను పునరుద్ధరించాలి

గన్నేరువరం: మండలంలోని పలు గ్రామాల్లో శిథిలావస్థకు చేరిన వాటర్ ప్లాంట్లను అధికారులు పునరుద్ధరించాలని సీపీఐ మండల కార్యదర్శి కాంతాల అంజిరెడ్డి కోరారు. మంగళవారం మండలకేంద్రంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కొన్ని గ్రామాల్లో వాటర్ ప్లాంట్లు మూతపడటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఇతర గ్రామాల్లోకి వెళ్లి తాగునీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. కొన్నిగ్రామాల్లో వాటర్ ప్లాంట్ల నిధులు దుర్వినియోగం జరుగుతున్నాయని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాణ్యత పాటించని ప్రైవేట్ వాటర్ ప్లాంట్లపై తగిన చర్యలు తీసుకోవాలని, లేకపోతే పార్టీ అధ్వర్యంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో మండల సహాయ కార్యదర్శులు బొక్కాల శ్రీశైలం, మొలుగురి సంపత్, కోశాధికారి గర్శకుర్తి శ్రీనివాస్, కూన మలయ్య, సాగర్‌రెడ్డి, సీహెచ్ కొమురయ్య పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

వీధి వ్యాపారులు ఆర్థికాభివృద్ధి సాధించాలి

జమ్మికుంట: పట్టణ ప్రగతి స్వా నిధి సే సమృద్ధి సంస్థ ద్వారా రుణాలు పొందిన వీధి వ్యాపారులు ఆర్థికాభివృద్ధి సాధించాలని మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయంలో మెప్మా, పట్టణ స్వానిధి సే సమృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వీధి వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. కమిషనర్ శ్రీనివాస్, బ్యాంక్ మేనేజర్లు దొరస్వామి నాయుడు, రాకేశ్, సీఎల్ఆర్‌పీలు, పాల్గొన్నారు.

విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీయాలి

జమ్మికుంట: పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఎల్ఐసీ 67వ వార్షికోత్సవం సందర్భంగా మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు మంగళవారం వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఎల్ఐసీ జమ్మికుంట మేనేజర్ విక్టర్ ఇమాన్యుల్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయాలన్నారు. పోటీల్లో కాకతీయ హైస్కూల్ విద్యార్థులు తనీష్ చంద్ర, అనురుధ్ ప్రథమ, తెలంగాణ సోషల్ వెల్ఫేర్ పాఠశాల విద్యార్థులు అభినయ్, చైతన్య ద్వితీయ, జెడ్పీ బాలికల ఉన్నతపాఠశాల విద్యార్థులు హర్ష, సుమ తృతీయ స్థానంలో నిలిచారు. ఎల్ఐసీ డీవో రాజేందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుధాకర్, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

హుజూరాబాద్‌రూరల్ : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఈనెల 9న సదరం క్యాంపు నిర్వహిస్తున్నట్లు హుజూరాబాద్ ఎంపీడీవో జయశ్రీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన దివ్యాంగులు ఈ సదరం క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పీఏసీఎస్ చైర్మన్‌కు సన్మానం

చొప్పదండి: జాతీయ ఉత్తమ పీఏసీఎస్ అవార్డును ఇప్పటికే మూడుసార్లు అందుకొని నాలుగో సారి జాతీయ స్థాయి ఉత్తమ పీఏసీఎస్ చైర్మన్‌గా ఎంపికైన చొప్పదండి పీఏసీఎస్ చైర్మన్ వెల్మ మల్లారెడ్డిని ప్రజా ప్రతినిదులు మంగళవారం సన్మానించారు. బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు వెల్మ శ్రీనివాస్ రెడ్డి, మంగళపల్లి సర్పంచ్ నాగిరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ ఏనుగు స్వామి రెడ్డి, లక్ష్మణ్, పీఏసీఎస్ డైరెక్టర్లు నాంపెల్లి మల్లయ్య, తదితరులున్నారు.

కళాకారుడికి..

మానకొండూర్: మండలంలోని చెంజర్ల గ్రామానికి చెందిన బోళ్ల కొమురయ్య (రామయణ కథా శిక్షకుడు) కరీంనగర్ ఫోక్ ఆర్ట్ అకాడమీ, ప్రవీణ్ సల్వాజీ మ్యూజికల్ గ్రూప్ ఆధ్వర్యంలో సాంస్కృతిక గురు పూజోత్సవ సర్టిఫికెట్‌ను కరీంనగర్‌లోని ఫిలింభవన్‌లో అందుకున్నారు. సత్యసాయి సేవా సమితీ కన్వీనర్ సుదగోని వెంకటయ్య, కార్యదర్శి సాయిరి దేవయ్య కొమురయ్యను అభినందించారు.

గురుపౌర్ణమి వేడుకలు

మానకొండూర్ : మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురు పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేశారు. ప్రిన్సిపాల్ ఆంజనేయరావు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత

శంకరపట్నం : మధ్యాహ్న భోజన నిర్వాహకులకు పెంచిన వేతనం, ఏరియర్స్, బకాయి బిల్లులను చెల్లించాలని, ప్రొసీడింగ్ ఆర్డర్స్ ఇవ్వాలని కోరుతూ మంగళవారం భోజన నిర్వాహకులు తహసీల్దార్ అనుపమకు వినతిపత్రం అందజేశారు. సెప్టెంబర్ 20 నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు వినతిపత్రంలో పేర్కొన్నారు. విజయలక్ష్మి, దేవేంద్ర, రజిత, సాయిలు, పాల్గొన్నారు.

ఇళ్లముందే వర్షపునీరు

రామడుగు: మూడురోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో ప్రజలు ఇబ్బందులు ఎర్కొంటున్నారు. గోపాల్‌రావుపేటలో బూరుగుపల్లి వెళ్లే రోడ్డులో మురుగుకాలువ లేకపోవడంతో ఇళ్లముందు వర్షపునీరు నిలిచింది. గ్రామానికి చెందిన ఆర్ఎంపీ సత్యనారాయణ ఇంటి చుట్టూ కొద్ది రోజులుగా ఇలానే ఉన్నా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



సైదాపూర్ : ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

చొప్పదండి/ హుజూరాబాద్ /హుజూరాబాద్‌రూరల్/సైదాపూర్/గన్నేరువరం/ చిగురుమామిడి/ జమ్మికుంట: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అన్ని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటాలకు పూలమాలలు వేశారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం గురువులను ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



జమ్మికుంట : సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు



చిగురుమామిడి : విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేసిన ఉపాధ్యాయులు



గన్నేరువరం : ప్రిన్సిపాల్ మధు సూదన్‌రెడ్డికి సన్మానం

ఆయుర్వేద వైద్యశాల తనిఖీ



సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీపీ కవిత

రామడుగు: మండలంలోని షానగర్‌లోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలను మంగళవారం ఎంపీపీ కలిగేటి కవిత లక్ష్మణ్ తనిఖీ చేశారు. హాజరుపట్టికను పరిశీలించారు. వైద్యశాలకు రాకున్నా సంతకాలు ఉండడంతో ఆగ్రహం వ్యక్తంచేశారు. అంబేద్కర్ జయంతి (ఏప్రిల్ 14) రోజు కూడా విధులకు హాజరైనట్లు సంతకాలు ఉండటంతో సిబ్బంది తీరుపై ఆమె ఆగ్రహం వ్యక్తంచేశారు. వైద్యాధికారితో పాటు ఫార్మాసిస్ట్ కూడా విధులకు రాకుండా సంతకాలు చేస్తున్నారని ఎంపీపీ తెలిపారు. కాగా సిబ్బంది తీరుపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు. వీడీసీ కరుణాకర్, వార్డుసభ్యులు పెంటి శంకర్ తదితరులున్నారు.

ప్రమాదకరంగా బ్రిడ్జి



రామడుగు: మండలకేంద్రంలోని సమీపంలో ఉన్న మోతె వాగుపై ఉన్న పాత బ్రిడ్జి మళ్లీ ప్రమాదకరంగా మారింది. మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో వరద నీరు ఉధృతంగా రావడంతో మట్టి పూర్తిగా కొట్టుకుపోయింది. బ్రిడ్జి కుంగడంతో గతంలో అధికారులు ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆదేశాలతో మట్టి, బండరాళ్లు వేసి వాహనాలు వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. మళ్లీ వరదనీరు ప్రవహించడంతో మట్టి , బండరాళ్లు కొట్టుకపోయి ప్రమాదకరంగా మారింది. మంగళవారం ఎంపీపీ కలిగేటి కవిత లక్ష్మణ్ బ్రిడ్జిని పరిశీలించారు. వాహనదారులు జాగ్రత్తగా వెళ్లాలన్నారు. షానగర్ సర్పంచ్ సైండ్ల కవిత కరుణాకర్, బీఆర్ఎస్ నాయకులు కలిగేటి లక్ష్మణ్, పెంటి శంకర్ పాల్గొన్నారు.

ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు



ఉట్టి కొడుతున్న చిన్నారులు



వేషధారణల్లో 'మాంటిస్సోరి' విద్యార్థులు

చొప్పదండి: మండలంలోని పలు పాఠశాలల్లో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. విద్యార్థులు కృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. మోడల్ స్కూల్‌లో కృష్ణాష్టమి వేడుకలను ప్రిన్సిపాల్ కోల రమేశ్ నిర్వహించారు. కృష్ణవేణి పాఠశాలలో కరస్పాండెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి పాల్గొన్నారు.

హుజూరాబాద్‌లో..

హుజూరాబాద్ : పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో మంగళవారం ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. కాకతీయ కాలనీలోని మాంటిస్సోరి ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో చిన్నారులు కృష్ణులు, గోపికల వేషధారణలో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో హెచ్ఎం గీతాషాజు, డైరెక్టర్ షాజు థామస్ తదితరులున్నారు.

పౌష్టికాహారం అందించాలి

హుజూరాబాద్ : తల్లిదండ్రులు చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గందెరాధిక అన్నారు. పోషణ్ అభియాన్ మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణంలోని 16వ వార్డులోని అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు కల్లెపల్లి రమాదేవి, మారెపల్లి సుశీల, వార్డు అధికారులు నూనె శంకరయ్య, జూపాక మొగిలి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

నియామకం

చొప్పదండి: మండలంలోని కోనేరుపల్లికి చెందిన గజ్జెల కృష్ణ మురళిని బీఎస్పీ నియోజకవర్గ కోశాధికారిగా నియమించినట్లు అసెంబ్లీ అధ్యక్షుడు నల్లాల రాజేందర్ తెలిపారు. తన నియామకానికి సహకరించిన బీఎస్పీ నాయకులు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, జిల్లా అధ్యక్షుడికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.